# రాంబందుల రెక్కల చప్పుడు

వెంకన్న బయల్దేరాడు; తెల్ల బట్టలు కట్టుకొన్నాడు; తలకి నూనిరాసుకున్నాడు; చేతుల కంటుకొన్న కాస్త నూనీ ముఖానికి పులుముకున్నాడు; తెల్ల చొక్కా— చెవులుముడుచుకు పోతుంటే యిస్త్రీ చేయని చాకలివాణ్ని తిట్టుకున్నాడు; యిస్త్రీకి డబ్బుయివ్వలేని తన్ని తనేతిట్టుకున్నాడు; ‘శీఁ వెండి’ గుండీ— మొలతాడుకి పూలుతాడుతో జాగ్రత్తగా బిగించి దాచుకున్నది— తీసి చొక్కాకి పెట్టుకున్నాడు; వెంకన్న బయలుదేరాడు.

“పని సూసుకుని యెంటనే వచ్చేయి” అంది లచ్చిమి; లచ్చిమి పెనిమిటి వెళ్ళిపోతూంటే పిర్రలు కదలడాన్నీ, కాళ్ళు వెనక్కీ— ముందుకీ, మరలో చక్రాల్లా కదలడాన్నీ, ఎగాదిగా ఎంతసేపు చూసిందని!

అప్పలమ్మ చెప్పనే చెప్పింది: "ఏదో యిద్దరూ కష్టపడితే రోజులు గడవ్వా! దిక్కుమాలిన వుద్యోగంలోకి ఎందుకూ?" అని మరీమరీ చెప్పింది. చెబితే వెంకన్న వింటాడా!

ఉద్యోగంలోకి ఎందుకు వెళ్ళాలో అప్పలమ్మ కనిపెట్టలేక పోయింది; పటాలంలో ఉద్యోగం ఎంత గొప్పదో అప్పలమ్మకేం తెలుసు?

"మళ్ళీ యుద్ధం వస్తోంది; పటాలంలోకి జనాన్ని తీసుకుంటారు..." అనే విషయం వెంకన్న తెలుసుకున్నాడు. కాని యుద్ధాలు ఎందుకు వస్తాయో, వస్తే పటాలాలేం చేయాలో అప్పలమ్మ తెలుసుకోలేకపోయింది.

అంచాతనే ఆమె తల్లి పేగు కంఠశోష పెట్టింది; "ఇంకా ఆర్నెల్లేనా అవలేదు మిమ్మల్నొక ఇంటోళ్ళని చేసి— దాని కడుపు పండకుండా పటాలానికి పోతే ఎలారా?" అంది—అప్పలమ్మ...యుద్ధంవల్ల లాభమేమిటో తెలీని తల్లి పేగు మరి!

"ఏదుగూ బొదుగూలేని మెదవ వుద్యోగం సేసేకన్న సత్తేనయం" నిశ్చయించుకున్నాడు వెంకన్న... అందుచేతనే పటాలంలో చేరాలనుకున్నాడు. ఆర్నెల్ల యి కట్టుకున్న యింటిదానికి చీరెలు చిరిగిపోయాయనీ, మెడ బోసిగావుందనీ, పుట్టింటివాళ్ళు పుట్టించిన రైకలు బిగువైపోయి చిరిగిపోతున్నాయనీ— వెంకన్న గ్రహించాడు. పటాలానికి పోయినవాళ్ళు

పిల్లాలికి నగలు చేయించగలరనికూడా విశ్వసించాడు... అందుకోసమే పట్నానికి బయల్దేరాడు వెంకన్న...

గబగబా అడుగులువేస్తూ, కవాతులోని సోల్జర్‌లా నడుస్తున్నాడు వెంకన్న గర్వంగా... తెల్లటిబట్టల్లో నల్లగా... ఠీవిగా నడుస్తుంటే అందరికీ ఆశ్చర్యమైంది. వెంకన్న తెల్ల బట్టలు వేసుకోవడం ముందెవరూ చూడలేదు... పెళ్ళినాడు కుట్టించుకున్న కోటూ చొక్కా, తాటాకుపెట్టెలో దాచు కున్నాడని, పాపం ఆ అందరికీ ఏం తెలుసు?

వెంకన్న దర్జాగా నడుస్తూనే ఉన్నాడు. తెల్లచొక్కాకి శ్రీ:వెండి బొత్తాంతో... తెల్లనిచొక్కాపైన వేసుకున్న నల్లని కాశీ తాడుతో... నిగనిగలాడుతున్న జుత్తుతో... జుత్తువంటి ముఖంతో...

వాణ్ని చూచినవాళ్ళు అనుకొన్నారు: "యిదేంటి సెప్మా! ఈడియాల, రాజులా ముస్తాబీ అయినాడు?...మిల్లుకి పోవడంలేదేం?" వెంకన్న నల్లలాగు, నూనితో మాసిన పాతబనీను తొడుక్కోలేదావేళ...

వెంకన్నని అడిగేశాడుకూడాను—

"పట్నానికేస్!".....విసురుగా జవాబిచ్చాడు... ఇవ్వాకేంఖర్మ వెంకన్నకి?... ఇదివరకటిలా రోజుకి పదణాల కూలీ కాదమ్మో! యెదవమిల్లులో ఎదుగూబొదుగూలేని పని

మానేస్తున్నాడయ్యో; పట్నానికి పటాలంలో చేరడానికి వెడు తున్నాడాయె!....

"పటాలాన్నెందుకు ఏత్తున్నారు సెప్మా?" ప్రశ్నించు కున్నాడు వెంకన్న... కాని సమాధానం రాలేదు.

"అన్నా...అదీ సంగతి...' తనలోతనే పిచ్చాడులా మాట్లాడుకుంటున్నాడు. విన్నవాళ్ళు నవ్వుతారేమో అని సిగ్గుపడ్డంలేదు వెంకన్న. నవ్వి పోదురుగాక తనకేమి సిగ్గు! పట్నానికి... పటాలానికి... గొప్ప ఉద్యోగంలోకి వెడు తున్నాడు వెంకన్న.

"వెంకన్నకి జ్ఞాపకం వచ్చింది..." అమెరికోళ్ళు రస్సావోళ్ళమీద యుద్ధంచేత్తారట! సంగంబాబు చెప్పలా?" తన్నితనే ప్రశ్నించుకున్నాడు; తన పందిమరుపుకి తనే గదమా యించుకున్నాడు.

రష్యావాళ్ళ దేశంలో తనలాంటి కూలీలే రాజ్యం ఏల్తున్నారనీ, తన మిల్లుయజమానిలాంటి అమెరికావాళ్ళు యుద్ధానికి తయారవుతున్నారనీ, "అదేటో ఆటంబాంబులు" తయారుచేశారనీ, సంగంబాబు చెప్పిందంతా జ్ఞాపకంవచ్చింది. ఆవేళ మీటింగునాడు పోలీసోళ్ళు రావడం...ఘర్షణ జరగడం ...సంగంబాబు మాయమైపోవడం... అంతా తన ఆశల్లాగే కళ్ళముందు తిరిగిపోయింది.

వెంకన్న రైలుబండిలా నడుస్తున్నాడు... నడుస్తుంటే దారిపక్క చెట్లు, ఎదుగూబొదుగూ లేని మిల్లు ఉద్యోగం లాగ నిలబడిపోతున్నాయి...ముందుకి, పట్నంలోకి, పటాలంలో చేరడానికి...గబగబా వెడుతున్నాడు వెంకన్న...

"అమెరికోళ్ళ గుండెలు రాతితో చేశారేమో?" అనుకున్నాడు వెంకన్న... యజమానులకి రాతిగుండె లుంటా యని, కూలీల ఏడ్పులకి అవి కరగవనీ సంగంబాబు చెప్పాడు... గుడిలో దేముణ్ణి రాయితో చేస్తారు. ఆమధ్య ప్రభుత్వం వారి దయవల్ల దేముణ్ని చూశాడు వెంకన్న. అంచాతనే అమెరికా వాళ్ళ గుండెలుకూడా రాతితో చేయడంలో ఏమీ సందేహం కలుగలేదు వాడి బుర్రకి...

"అమెరికోళ్ళు యజమానులు, రష్యావోళ్ళు కూలీ లూనా?" మళ్ళా ప్రశ్నించుకున్నాడు వెంకన్న. కూలీలకీ యజమానులకీ పోరుతప్పదని సంగంబాబు చెప్పిన రహస్యం వెంకన్న జ్ఞాపకానికి వచ్చింది.

రష్యాలో తన మిల్లు యజమాని లాంటివాళ్లు లేరని వెంకన్నకి తెలిసినా, అమెరికాలోకూడా తనవంటి మిల్లు కూలీలున్నారని ఆ చిన్నబుర్రకి తెలియలేదు. ఎలా తెలుస్తుంది? వెంకన్న చదువుకోలేదు, పైగా వాడికి రెండు చెవులూ వున్నాయి— ఒకటి వినడానికీ, మరోటి మరిచి

పోడానికీని. మొన్నకూడా ప్రభుత్వం అతనికి ఓటు మంజూరు చేయలేదు పాపం!

వెంకన్న గబగబా నడుస్తున్నాడు. ఏవో ఆలోచనలు రచించుకుంటూ నడుస్తున్నాడు. పెళ్ళానికి నగలు చేయించడానికీ; కొత్త రవికలు కుట్టించడానికీ... గబగబా పటాలంలో చేరడానికి...పట్నానికి;

"పట్నం ఆరుకోసిళ్ళుందంట! మద్దినాళ్ళకి యెంతా నేమో!" అనుకున్నాడు వెంకన్న. సూర్యుడుకూడా వెంకన్న లాగే వేగంగా నడుస్తున్నాడు— అయితే పటాలంలో చేరడానికి మాత్రం కాదు.

"ఎండెక్కి—పోకుండా సేరుకోవాల" వెంకన్న తీర్మానించుకున్నాడు. ఆలోచించడం మానేయాలనుకున్నాడు వెంకన్న. పరధ్యానంగా ఉంటే నడక కలిసిరావడం లేదని తెలుసుకున్నాడల్లేవుంది.

గాంధీగారికి శిష్యరికంచేయని వెంకన్నకి ఆత్మనిగ్రహం చేతకాలేదు— వాళ్ళ మిల్లు యజమాని గాంధీటోపీ పెట్టుకుంటాడు. మిల్లులో వాకిలిగోడకి పెద్ద గాంధీఫోటో తగిలించాడు. తన యజమాని తనకి శత్రువు. అంచాతనే వెంకన్న గాంధీ శిష్యరికం చేయలేదు. అంతే! అంతకన్నా రాజకీయాలేమీ తెలియవు వెంకన్నకి.

వెంకన్నకి ఆత్మనిగ్రహం లేకపోవడానికి అదేకారణం! అంచాతనే వాడిబుర్ర దానంతటదే ఆలోచన పా్రరంభించింది;

" మా బాబుకాలంలో యుద్ధమొందట, సెప్పేవాడు. మళ్ళీ మూడేళ్ళు అయింది యుద్ధమైపోయి. మళ్ళీ యుద్ధం దేనికి సెప్మా?" వెంకన్న ప్రశ్నించుకున్నాడు. ఈ అంతర్జాతీయ రాజకీయ కీలకం అర్ధంకాలేదు వెంకన్నకి.

"రంగంలో కూలీల విప్లవం జరుగుతోందట! దాని కోసం మన పటాలాల్ని రంగం పంపిస్తారట నెహ్రూగారు!" —సంగంబాబు చెప్పింది గభాలున జ్ఞాపకంవచ్చింది వెంక న్నకి—"కొంపతీసి నన్నుకూడా రంగం పంపరు గందా కూలీల్ని సంపరా యెదవాలని?"

వెంకన్న ప్రశ్నించుకున్నాడు—అవ్వాకావాలి బువ్వా కావాలి అంటే ఎలాగో వెంకన్నకి బోధపడలేదు. పెళ్ళానికి నగలు చేయించాలనుకున్నాడు; ఎదుగూ బొదుగూ లేని మిల్లు న్నౌఖరీ వొదిలేయాలనుకున్నాడు మరి..."జీతం ఇచ్చినపుడు తప్పుద్దా?" అనుకున్నాడు వెంకన్న.

"విప్లవం" అంటే సమ్మెకట్టడమే అనుకున్నాడు వెం కన్న. తన మిల్లులో సమ్మె జరిగినపుడు తనూ పాల్గొన్నాడు. కూలీలు అంతకన్నా మించి చేయగలిగే దేమిటో స్ఫురించ లేదు వాడికి.

మిల్లులో సమ్మె జరిగినపుడు పెద్దకూలీ అప్పలస్వామిని, వాడి పోలీసు బావమరిది లాఠీతో కొట్టడం కళ్ళారాచూశాడు. అలాగే తనూ, జీతం కావలిస్తే చెప్పిన పని చేయవలసిందే కాబోలనుకున్నాడు వెంకన్న.

"యింతకీ రంగంలో కూలీలు యిప్లవంచేస్తే మనకేం చెప్మా? నెహ్రూగారు పటాలాన్ని ఎందుకు పంపుతున్నారో?" మళ్ళీ ప్రశ్నించుకున్నాడు వెంకన్న. కాని ఈమాటు సమాధానం కోసం వెదుక్కోలేదు. ఏం లాభం? వాడికేం తెలుసని సమాధానం చెప్పుకోగలడు?

"ఆసియా ఖండం మహావిపత్తులో మునిగి పోతోందని" వాడికేం తెలుసు? ఒకవేళ తెలిసినా అది తన యజమానిలాంటి అమెరికా వాళ్ళవల్లే అయివుంటుందని వాడునమ్ముతాడు. అందుచేతనే ఆ ప్రశ్నకి సమాధానం 'అంతర్జాతీయవాది' నెహ్రూకే విడిచిపెట్టాడు. ఆ మహారాజకీయాలజోలికి ఓటులేని వెంకన్న పోదల్చుకోలేదు.

వెంకన్న పటాలంలో చేరడానికి నడుస్తూనే ఉన్నాడు; ఎవడేనా యింకోడుతోడువస్తే ఎంతబావుండునో అనుకున్నాడు; హాయిగా కథలు చెప్పుకుంటూ, హుషారుగా పోవచ్చుకదా అనుకున్నాడు.

కథ అనగానే నారాయుడు చెప్పినకథ జ్ఞాపకంవచ్చింది. భట్టివిక్రమార్కుడి కథలో చిలక మాట్లాడ్డం దగ్గర్నించి, అంతా మరచిపోకుండా తలుచుకున్నాడు వెంకన్న.

“యెదవ— ఆణ్ని రమ్మంటే రానన్నాడు. ఎదుగూ బొదుగూ లేని ఉద్యోగంలోనే చత్తానన్నాడు” నారాయుణ్ని తిట్టుకున్నాడు వెంకన్న.

వెంకన్న నడుస్తూనే ఉన్నాడు; ఆలోచిస్తూనేఉన్నాడు; సూర్యుడుకూడా నడుస్తున్నాడు. ఆలోచిస్తున్నాడో లేదో తెలియదు; ఎండ చెంప కొడుతోంది; దాహం వేసింది వెంకన్నకి.

“యెదవ రోడ్డు తరగదేం సెప్మా?” అనుకున్నాడు వెంకన్న. పట్నంపోయే కారు, మొహాన్ని జల్లిన దుమ్ము తుడుచుకుంటూ.

వెంకన్న రోడ్డుపక్క పొలంలోకి వెళ్ళాడు; నూతిలో నీరు చింకిచేదదో తోడుకున్నాడు; రెండుగుక్కల్లో దాహం తీర్చుకున్నాడు: చొక్కా చెంగు తడిస్తే పిడుచుకున్నాడు; కాస్సేపు కూర్చునిపోదాంలే అనుకున్నాడు; పెద్ద రావిచెట్టుకింద చతికిలపడ్డాడు.

నడుం లాగినట్టనిపించింది వెంకన్నకి; కాళ్ళు జాపుకున్నాడు గడ్డిలో, కాళ్ళు ఒణుకుతున్నట్టనిపించింది. పచ్చగడ్డి కాళ్ళకి కితకితలు పెడుతోంది. వెంకన్న మీసాలు గుచ్చుకుని కితకితలు పెడితే పెళ్ళాం పకపకా నవ్వడం జ్ఞాపకం వచ్చింది. పెళ్లాం జ్ఞాపకం రావడంతోటే పటాలం జ్ఞాపకం వచ్చింది.

ఉబ్బెత్తుగా లేవబోయాడు వెంకన్న. పోనీలే కాస్సేపుకూర్చొని వెడదాం అనుకొని స్థిమితపడ్డాడు.

పైమీది తువ్వాలు పర్చుకున్నాడు; తెల్లచొక్కా మాసిపోతుందని– నడుం వాల్చాడు వెంకన్న.

నారాయుడు చెప్పిన కథ తల్చుకుంటూ పైకిచూశాడు వెంకన్న– రావిచెట్టు చివరి కొమ్మపై రాంబందులు కనిపించాయి. ఏదో ఆలోచించుకుంటూ నారాయుడి కథ తలుచు కుంటూ అలాగే కునికాడు వెంకన్న.

నారాయుడు కథ చెబుతున్నాడు; రాజకుమారుడు– మంత్రికుమారుడు–అడివిలో...చెట్టుమీదపక్షుల మాటలు... నిద్రపోయిన రాజకుమారుడు వినలేదు; మంత్రి కుమారుడు విన్నాడు: రాజుకి గండంఉందనీ, చెట్టు విరిగిపడిపోతుందనీ– రాజకుమారుడికి వున్న గండాల్నీ అన్నిటికీ విరుగుళ్ళనీ చెప్పాయి...విన్నవాళ్ళు చెప్పకూడదని శపించాయి. పక్షులు ఎగిరిపోయాయి.

చెట్టుకొమ్మ ఫటఫటా విరగడం స్పష్టంగా వినిపించింది, వెంకన్నకి. మాగన్నుపట్టినా తాను పట్నానికి వెళ్ళాలనీ, పటాలంలో చేరాలనీ; త్వరగానే జ్ఞాపకం వచ్చింది వెంకన్నకి. తను రాజకుమారుడు కాదనికూడా ఖచ్చితంగా జ్ఞాపకం వచ్చింది వెంకన్నకి. చెట్టువిరిగి మీదపడిపోతే రక్షించడానికి మంత్రికుమారుడు కాదు కదా, కనీసం నారాయుడుకూడా దగ్గర లేడనే విషయం మరిచిపోలేదు వెంకన్న.

త్రుళ్ళిపడిలేచాడు వెంకన్న; లేచి నిల్చున్నాడు; కళ్ళు నులుముకొని మెలకువ తెచ్చుకున్నాడు; పైకి చూశాడు స్పష్టంగా; రాంబందులు కంగారుగా లేచి ఎగిరిపోతున్నాయి.

వెంకన్నకి భవిష్యత్తు తెలియడానికి ఎంతోసేపు పట్ట లేదు. ఉపాయంకూడా తట్టకపోలేదు, అపాయం తప్పించు కుందుకు; పరిచిన తువ్వాలు దులుపుకుని, దూరంగా పారి పోయాడు వెంకన్న.

ప్రమాదంలేదని తెల్సుకున్నాడు. పటాలంలోకి ధీమాగా వెళ్ళొచ్చు ననుకున్నాడు. ఆగి నించున్నాడు వెంకన్న. చెట్టుకొమ్మ పడిపోతోందేమోనని వెనక్కితిరిగి చూశాడు.

అప్పుడు జ్ఞాపకం వచ్చింది...వెంకన్న కలలో కథ వింటున్నాడని, కథలో చెట్టుపడిపోయిందనీ! అమెరికా రాంబం దులు ఆశియా కళేబరాన్ని దేన్నో చూశాయనీ, అందుకే హడావుడిగా పరుగెడుతున్నాయనీకూడా తెలుసుకున్నాడు.

"యీటి తస్సాదియ్యా!" అనుకున్నాడు వెంకన్న. పకపకా నవ్వుకున్నాడు; "ఎదవ నారాయుడు ఎంతపని చేశాడు?" ప్రేమగా తిట్టుకున్నాడు వెంకన్న.

వెంకన్న గబగబా అడుగులువేస్తూ, పట్నంవేపు నడుస్తున్నాడు. పటాలంవేపు నడుస్తున్నాడు. పటాలంవాళ్ళు

తనలాగే నడుస్తారని వెంకన్నకి తెలియదు; కాని...వాణ్ని ఏదో ఆవహించింది. అంచాతే సోల్జర్‌లా నడుస్తున్నాడు.

సోల్జర్‌లా నడుస్తూ ఆలోచించుకున్నాడు; "ఎందుకు పటాలానికి ఖర్రదాన్ని, అమ్మనీ వదలి? యెదవ నారాయుడు రానన్నాడు గందా మానేయరాదు?"—ప్రశ్నించుకున్నాడు వెంకన్న.

కాని వెంకన్న నడక మానలేదు...వేగం తగ్గించలేదు. గబగబా అడుగులు వేస్తున్నాడు...పట్నానికి...పటాలానికి..

"ధనమూలం యిదంజగత్..." అని మన వేదాంతులు కూడా ఘోషించారని వెంకన్నకు తెలియదు; అలాంటి సూత్రాలతో వాడికి నిమిత్తంలేదు; కాని, పెళ్ళానికి యిరుకై పోయిన పాత్నరైక...బోసిమెడా...

పటాలానికి వెళ్ళాలనిపించింది వెంకన్నకి.

అందుచేతనే గబగబా నడుస్తున్నాడు...యుద్ధంనిజంగా ఎవరిమీద జరుగుతుందో సరిగా తెలియకపోయినా...ఒకవేళ రంగం వెడితే తనలాంటి కూలీలు యిప్లవంలో తన్ని చంపేస్తా రేమో అని భయంతోచినా...వేగంగా అడుగులు వేస్తూనే వున్నాడు వెంకన్న...

అనేక రోజులున్నించి ఏదో తెలీనిశక్తినడిపిస్తే మిల్లుకి నడవలేదూ?...అలాగే నడుస్తున్నాడు వెంకన్న...

"యెదవ యుద్ధాలెందుకు వస్తాయి?" వెంకన్న ప్రశ్నకి ఎగిరివ దుమ్ము శూన్యంగా సమాధానం చెప్పింది.

రాంబందులు రివ్వుమంటూ ఎగిరిపోతున్నాయి; 'అమెరికోళ్ళ' విమానాల్లాగ రెక్కలు చప్పుడు చేసుకుంటూ దూరదూరాలకి...కళేబరాలకోసం — ఎగిరిపోతూనే ఉన్నాయి. రాంబందుల రెక్కల చప్పుడు వింటూంటే చాలా భయం వేసింది వెంకన్నకి. పట్టపగలు కనక గట్టిగా అరవలేదు.

"యెదవముండా యజమాని జీతం పెంచ కూడదూ?" వెంకన్న ప్రశ్నకి ఆకాశంలో పరిగెడుతున్న నల్లని మబ్బులు వెకిలిగా నవ్వాయి:

రాంబందుల రెక్కల చప్పుడు వింటూ గబగబా అడుగులు వేస్తూ నడుస్తున్నాడు వెంకన్న. ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు...పట్నానికి, పటాలంలో చేరడానికి!

★